నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
15 | హైదరాబాద్, మంగళవారం 26 మార్చి 2024 | RANGAREDDY

గెలుపే లక్ష్యంగా..

ప్రజల్లోకి గులాబీ సేన

బీఆర్ఎస్ శ్రేణుల్లో సార్వత్రిక జోష్

జిల్లా పరిధిలోని అన్ని పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధినేత కేసీఆర్

దూకుడు పెంచిన అభ్యర్థులు..

సందడిగా సన్నాహక సమావేశాలు

కాంగ్రెస్, బీజేపీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ

రంగారెడ్డి, మార్చి 25(నమస్తే తెలంగాణ): అన్ని పార్లమెంటు స్థానాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభ్యర్థులను ప్రకటించారు. ఐదు పార్లమెంటు స్థానాలతో రంగారెడ్డి జిల్లాకు అనుబంధం ఉండగా.. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు దూకుడును పెంచాయి. పలు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు ఇప్పటికే మొదలవ్వగా.. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి అన్ని నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యేలా కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి, బీఆర్ఎస్ మధ్య ఓట్ల శాతం స్వల్పంగానే తేడా ఉండడం.. కాంగ్రెస్, బీజేపీపై ప్రజల్లో వ్యతిరేకత పెరగడం బీఆర్ఎస్‌కు అనుకూలిస్తాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.



కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల నేతృత్వంలో ఒక విడుత అన్ని నియోజకవర్గాల నేతలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో చేసిన దిశానిర్దేశం మేరకు జిల్లాకు చెందిన నేతలు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించి పార్టీ అభ్యర్థుల గెలుపునకు పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో సమావేశాలను నిర్వహిస్తున్నారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేసేందుకు ఇప్పటికే మహేశ్వరం, పరిగి నియోజకవర్గాల్లో సమావేశాలను నిర్వహించారు. ఈ నెల 26న తాండూరులో, 27న రాజేంద్రనగర్‌లో, 30న శేరిలింగంపల్లిలో, ఏప్రిల్ 1న చేవెళ్లలో, 3న వికారాబాద్‌లో సమావేశాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాలు పార్టీ క్యాడర్‌లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మరోసారి సమావేశాలు నిర్వహించేలా వ్యూహ రచన చేస్తున్నారు. అభ్యర్థులు సైతం ముఖ్య నేతలు, పార్టీ కార్యకర్తలను కలిసి గెలుపునకు కృషి చేయాలని కోరుతున్నారు. కేసీఆర్‌తో భారీ బహిరంగ సభల నిర్వహణకు సంబంధించి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేస్తుండడంతోపాటు రోడ్ షోలను నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

రంగంలోకి బలమైన అభ్యర్థులు..

బీఆర్ఎస్ అధినేత వ్యూహాత్మకంగా ఎంపీ స్థానాలకు బీఆర్ఎస్ నుంచి బలమైన అభ్యర్థులను రంగంలోకి దించారు. చేవెళ్ల స్థానం నుంచి కాసాని జ్ఞానేశ్వర్, భువనగిరి నుంచి క్యామ మల్లేశ్, నాగర్‌కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజిగిరి నుంచి లక్ష్మారెడ్డిలను అభ్యర్థులుగా ప్రకటించారు. గట్టి పోటీనిచ్చే అభ్యర్థులను ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. వ్యూహాత్మకంగా చేవెళ్ల, భువనగిరి స్థానాలకు బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థులకు సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో 8 అసెంబ్లీ స్థానాలకుగాను 5 స్థానాలను గెలుచుకుని బీఆర్ఎస్ సత్తా చాటింది. అదే ఉత్సాహంతో పార్లమెంటు ఎన్నికల్లోనూ మెజార్టీ ఎంపీ స్థానాలను గెలుచుకునేలా గులాబీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ప్రస్తుత ఎన్నికల్లో అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం.. అన్ని వర్గాల సంక్షేమాన్ని సైతం విస్మరించడం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయి.

సమావేశాలతో క్యాడర్‌ను సన్నద్ధం చేస్తూ..

పార్లమెంటు ఎన్నికల్లో అన్ని పార్టీల కంటే ముందుగానే బీఆర్ఎస్ పార్టీ దూకుడుగా వ్యవహరిస్తున్నది. పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్

చేవెళ్ల మండలంలోని ఊరెళ్ల గ్రామంలో..

శంషాబాద్‌లో..

రంగుల కళ..

శంషాబాద్‌లో..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సోమవారం రంగుల సంబురం అంబరాన్నంటింది. ఆదివారం రాత్రి కామదహనం చేయగా, సోమవారం తెల్లవారుజాము నుంచే రంగుల్లో మునిగితేలారు. కుల మతాలకతీతంగా చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పల్లెలు, పట్టణాల్లో డప్పుచప్పుళ్లతో ర్యాలీలు నిర్వహించగా, మహిళలు పాటలు పాడుతూ సంబురాలు జరుపుకొన్నారు. యువతీయువకులు డీజేలు, బ్యాండ్ చప్పుళ్ల మధ్య డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేశారు. రంగుల్లో తడిసి ముద్దైన తర్వాత మధుర జ్ఞాపకంగా ఉండాలని సెల్ఫీలు దిగారు. హోలీ వేడుకల్లో నాయకులు, ప్రజాప్రతిధులు, ఉద్యోగులు సైతం రంగుల సంబురాల్లో పాల్గొని సందడి చేశారు.

శంషాబాద్‌లో..

మొయినాబాద్‌లోని సురంగల్‌లో..

వికారాబాద్ పట్టణంలో..

కడుపుకోతలే..

ప్రైవేట్ దవాఖానల్లో సిజేరియన్‌ల దందా

సాధారణ డెలివరీలకు అవకాశ మున్నా శస్త్ర చికిత్సకే ప్రాధాన్యం

గత మూడు నెలల కాలంలో ప్రైవేట్‌లో 669 ప్రసవాల్లో 602 సిజేరియన్లు

కేవలం 67 మాత్రమే సాధారణ ప్రసవాలు

ప్రభుత్వ దవాఖానల్లో 2241 ప్రసవాలకు 788 శస్త్ర చికిత్సలు మాత్రమే

సిజేరియన్లతో రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు

బిల్లుల మోతే..

గర్భిణులు ప్రసవం కోసం ప్రైవేట్ దవాఖానల కెళ్తే బిల్లుల మోత మోగుతున్నది. ఆపరేషన్ అయితే.. ఇన్వెస్టిగేషన్ పేరుతో రూ.4 వేలు, మత్తు మందు వైద్యుడి పేరుతో రూ.2వేల నుంచి రూ.3 వేల వరకు, ఆపరేషన్ మెడిసిన్ పేరిట రూ.4000 నుంచి రూ.5000 వరకు వసూలు చేస్తున్నారు. ఇక దవాఖాన నుంచి తల్లీబిడ్డ బయటికొచ్చే రోజు వరకు బెడ్‌చార్జి, రూమ్ సర్వీస్, సర్వీస్ చార్జిలు, హాస్పిటల్ మెయింటెనెన్స్, పవర్ బిల్ అన్నీ కలిపి రూ.60 వేల నుంచిరూ.80 వేలు సమర్పించు కోవాల్సిందే. ప్రైవేట్ దవాఖానల్లో సాధారణ ప్రసవాల శాతం చాలా తక్కువగా ఉన్నప్పటికీ బిల్లుల వసూలు మాత్రం తగ్గడం లేదు. సాధారణ ప్రసవం అయ్యే గర్భిణులకు ఇన్వెస్టిగేషన్ పేరుతో రూ.5వేలు, మెడిసిన్ చార్జిలు రూ.3వేలు, ఇతరత్రా ఖర్చులు రూ.5 వేలు, మెయింటెనెన్స్, రూమ్ సర్వీసు, బెడ్‌చార్జి, ఇతర ఖర్చులు కలుపుకొని రూ.30వేలు బిల్లు చెల్లించాల్సిందే. దీంతో ఎంత దోపిడీ జరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్‌తో పోల్చితే ప్రభుత్వ దవాఖానల్లోనే సాధారణ ప్రసవాల రేటు అత్యధికంగా ఉన్నది.

విచ్చలవిడిగా ఆపరేషన్లు..

ప్రైవేట్ దవాఖానలకు వెళ్లిన గర్భిణులకు విచ్చలవిడిగా ఆపరేషన్లు చేస్తున్నట్లు జనం ఆరోపిస్తున్నారు. స్కానింగ్ తీయడం, బిడ్డ అడ్డం తిరిగిందని..రక్తం తక్కువగా ఉందని..పేగులు మెడకు చుట్టుకున్నాయని, ఆపరేషన్ చేయకుంటే తల్లికి బిడ్డకు ప్రమాదం అని రకరకాల కారణాలు చెప్పి రోగులు, వారి బంధువులను భయభ్రాంతులకు గురి చేస్తూ డాక్టర్లు అందినకాడికి దండుకుంటురని విమర్శలున్నాయి. జిల్లాలో ఉన్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలో గడిచిన మూడు నెలల వ్యవధిలో 669 ప్రసవాలు జరుగగా అందు లో 602 డెలివరీలు శస్త్ర చికిత్సల ద్వారానే జరిగాయి. ప్రైవేట్ దవాఖానల్లో డెలివరీల ఆపరేషన్ల రేటు 90 శాతంగా ఉండగా.. సాధారణ కాన్పులు కేవలం 10 శాతమే. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు మూడు నెలల్లో కేవలం 67 మాత్రమే. డిసెంబర్‌లో 241 ప్రసవాలు జరుగగా అందులో సిజేరియన్లు 213.. జనవరిలో 245 డెలివరీల్లో సిజేరియన్లు 221 .. ఫిబ్రవరిలో 183 డెలి వరీలు జరుగగా అందులో సిజేరియన్లు 168 ఉన్నాయి. అదేవిధంగా ప్రభుత్వ దవాఖానల్లో గత మూడు నెలల్లో 2,241 ప్రసవాలు జరుగగా 788 ప్రసవాలు మాత్రమే సిజేరియన్లు జరిగాయి.

వికారాబాద్, మార్చి 25 (నమస్తే తెలంగాణ): జిల్లాలో 'కడుపుకోత'లు జోరుగా సాగుతున్నాయి. కొన్ని ప్రైవేట్ దవాఖానల యాజమాన్యాలు కాసుల కో సం కక్కుర్తిపడి సిజేరియన్లకు తెగబడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ కాన్పులకు అవకాశమున్నా.. ఏదో ఒక సాకు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఒక్కో సీజేరియన్‌కు రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నాయి. జిల్లాలోని ప్రైవేట్ దవాఖానల్లో జరిగే ప్రసవాల్లో దాదాపు 90శాతం ప్రసవాలు ఈ తరహావే ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అధికారులు రూపొందించిన నివేదిక ద్వారా తెలుస్తున్నది. అదే సమయంలో ప్రభుత్వ దవాఖానల్లో జరిగే ప్రసవాల్లో కేవలం 20-30శాతం ప్రసవాలు మాత్రమే సిజేరియన్లు జరుగు తుండడం గమనార్హం. జిల్లాలో 50 వరకు ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు ఉన్నాయి. సీటీస్కాన్ సెంటర్లు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఎక్స్‌రే సెంటర్లు కలిపి 20 వరకు డయాగ్నోస్టిక్ సెంటర్లున్నాయి. చాలా ప్రైవేట్ నర్సింగ్‌హోంలలో మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. వీటిని ఆయా దవాఖానల యాజమాన్యాలే నడిపిస్తున్నాయి. జిల్లాలో చాలావరకు ప్రైవేట్ దవాఖానల్లో గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లోని ఆర్ఎంపీ, పీఎంపీలు మధ్యవర్తులుగా పని చేస్తున్నారు. వీరికి విపరీ తమైన పబ్లిసిటీ చేస్తున్నారు. తమ దవాఖానకొస్తే అత్యాధునిక సేవలు అందిస్తామని నమ్మబలుకుతున్నారు. గర్భిణులకు ప్రతినెలా స్కానింగ్‌లు, పరీక్షలు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులను నియంత్రిస్తాం

జిల్లాలోని ప్రైవేట్ దవాఖానలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని గర్భిణులు ప్రసవాల కోసం ప్రైవేట్ దవాఖానలకు వెళ్లకుండా సర్కారు ఆస్పత్రులకు వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నాం. గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగింది.

-డా.పల్వన్‌కుమార్, వికారాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్‌పై అద్దె సైకిళ్లు

నార్సింగి హబ్‌లో 200 సైకిళ్లు -గంటకు రూ.50 అద్దె

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : ఔటర్ రింగు రోడ్డు సోలార్ రూఫ్ టాప్ సైకిల్ ట్రాక్ మీద సైకిళ్లు దూసుకుపోతున్నాయి. నగరంలో సైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రేటర్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు వెంబడి 24 కి.మీ మేర అంతర్జాతీయ ప్రమాణాలతో సోలార్ రూప్ టాప్ సైకిల్ ట్రాక్‌ను నిర్మించింది. అంతేకాకుండా ప్రత్యేక చొరవ తీసుకొని సైకిల్ ట్రాక్ మీద సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు దాని వెలుతురులో హాయిగా సైక్లింగ్ చేసుకునే సైక్లింగ్ చేసుకునే అవకాశం కల్పించింది. సొంత సైకిళ్లు ఉన్న వారు నేరుగా ఈ ట్రాక్‌పై సైక్లింగ్ చేసే అవకాశం ఉండగా, లేని వారి కోసం అద్దెకు సైకిల్ స్టేషన్‌లను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం మొదటి సైకిల్ స్టేషన్‌ను నార్సింగి హబ్‌లో ఏర్పాటు చేసి సుమారు 200 సైకిళ్లను అందుబాటులో ఉంచగా, అందులో 40కి పైగా ఎలక్ట్రిక్ సైకిళ్లు సైతం ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. అద్దెకు ఇచ్చే సైకిల్‌కు గంటలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ఆధ్వర్యంలో సైకిల్ స్టేషన్ల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారు. 24కి.మీ ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్‌పై 4 చోట్ల సైకిల్ స్టేషన్‌లను ఏర్పాటు చేయగా, అందులో తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్, నానక్‌రాంగూడ, నార్సింగి, కొల్లూరు ప్రాంతాలను సైకిల్ స్టేషన్ల కోసం ఎంపిక చేసి అక్కడ మౌలిక వసతులు కల్పించారు. ప్రస్తుతం నార్సింగి హబ్‌లో సైకిళ్లు అద్దెకు అందుబాటులో ఉండగా, త్వరలోనే మిగతా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

ఓఆర్ఆర్ సైకిల్ ట్రాక్ ప్రాజెక్టులోని నార్సింగి హబ్‌లో ఏర్పాటు చేసిన అద్దెకు ఇచ్చే సైకిళ్లు